హైదరాబాద్ వార్త



# అంబులెన్సుకే.. ఆపద



**కుయ్.. కుయ్‌కు రాస్తానై!**

**నగర ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్న ఎమర్జెన్సీ వెహికల్స్**

**ఇటీవల కురిసిన వర్షాలకు అధ్వాన్నంగా మారిన రహదారులు**

**గుంతలతో ఎక్కడికక్కడ ట్రాఫిక్ జామ్**

**108, ఇతర అంబులెన్స్‌లకు దొరకని దారి**

**బాధితులను ఆస్పత్రులకు తరలించడంలో జాప్యం**

నగరంలో ఇటీవల వరుసగా కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. రోడ్లపై భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఫలితంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. పీక్ అవర్స్‌గా పేర్కొనే ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు.. మధ్యాహ్నం 12.30గంటల నుంచి 2 గంటల వరకు..సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10గంటల వరకు ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ సమయంలో నగరంలోకి వచ్చే అంబులెన్స్‌లు ట్రాఫిక్‌లో చిక్కుకుంటున్నాయి. సకాలంలో అస్పత్రికి చేరుకోకపోవడం తో పరిస్థితి విషమించి బాధితుల ప్రాణాల మీదకు వస్తోంది. వైద్య పరిభాషలో ప్రమాదం జరిగిన తర్వాత తొలి గంటను 'గోల్డెన్ అవర్'గా పేర్కొంటారు. క్షతగాత్రులను ఈ సమయంలోపు ఆస్పత్రులకు తరలిస్తే వారు ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుంది. కానీ తరలింపులో జరుగుతున్న జాప్యంతో మరణాలు సంభవిస్తున్నాయి.

హైదరాబాద్, అక్టోబరు 17 ప్రభాతవార్త : బోడుప్పల్‌కు చెందిన ఒక గర్భిణి గురువారం మధ్యాహ్నం పురిటి నొప్పులు రావడంతో బంధువులు 108 అంబులెన్స్‌లో తీసుకొని ఆస్పత్రికి బయలుదేరారు. అప్పటికే రోడ్లపై భారీగా ట్రాఫిక్ రద్దీ ఉండటం, చాలాచోట్ల రహదారులపై గుంతలు ఉండడంతో వాహనాల వేగం నెమ్మదిం చింది. వాస్తవానికి 15 నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన వాహనం అరగంటకు పైగా ట్రాఫిక్‌లోనే చిక్కు కుంది. అప్పటికే నొప్పులతో బాధపడుతున్న గర్భిణి అంబులెన్స్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డను ఆస్పత్రిలో చేర్పించారు. ఇలా ఒక్క గర్భిణినే కాదు..108, ఇతర అంబులెన్స్‌లలో వైద్యం కోసం ఆస్పత్రులకు వెళ్తున్న బాధితులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ రద్దీనే ఇందుకు కారణమవుతోంది. ఓఆర్ఆర్ సహా శివారు జిల్లాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులను, గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులను అత్యవసర పరిస్థితుల్లో అస్పత్రులకు చేర్చే క్రమంలో అంబులెన్స్‌లకు ట్రాఫిక్ అడ్డంకిగా మారింది. అంబులెన్స్‌లు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోకపోవడంతో గర్భిణులు ఆయా వాహనాల్లోనే ప్రసవిస్తుండగా.. అనారోగ్య బాధితులు మృత్యువాతపడుతున్నారు.

వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో పాటు నగరంలో వాహనాల రద్దీ కూడా ఎక్కువగా ఉంటోంది. వరంగల్ జాతీయ రహదరి లోని మేడిపల్లి, బోడుప్పల్, ఉప్పల్ వరకు, అంబర్‌పేట శ్రీరమణ థియేటర్ చౌరస్తా నుండి అంబర్‌పేట చేనెంబర్, గోల్నాక తదితర పలు రహదారుల్లో రోడ్డు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇక ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, ఉప్పల్ చౌరస్తా, పంజాగుట్ట, అమీర్‌పేట్, కూకట్‌పల్లి, కోఠి, సికింద్రాబాద్, ప్యారడైజ్, ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ రోడ్డు, హిమాయత్‌నగర్, లిబర్టీ, మెహిదీపట్నం, గచ్చిబౌలి, మాదాపూర్, జూబ్లిహిల్స్ చెక్‌పోస్టు తదితర ప్రాంతాల్లో పీక్ అవర్స్‌లో వాహనాలన్నీ ఒకేసారి రోడ్లపైకి వస్తుండడంతో ఈ ప్రాంతాల్లో ట్రాఫిక్‌జామ్ అవుతోంది. అంతేకాకుండా అత్యవ సర పరిస్థితుల్లో అంబులెన్స్‌లకు దారి ఇవ్వాలనే సామాజిక స్పృహ చాలా మంది వాహనదారుల్లో ఇప్పటికీ కొంత లేకపోవడంతోనూ ఇబ్బందులు తలెత్తుతున్నా యి. ఫలితంగా 15 నిమిషాల్లో ఆస్పత్రికి చేరుకోవాల్సిన అంబులెన్స్‌లు 30 నిమిషాలకు పైగా రోడ్లపైనే నిలిచిపోతున్నాయి.

గ్రేటర్ పరిధిలోని ఏడు జిల్లాల పరిధిలో దాదాపు 7,200 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. సుమారు 150 కిలోమీటర్ల పొడవైన ఔటర్‌రింగ్ రోడ్డుతో పాటు పలు రాష్ట్రీయ జాతీయ రహదారులు దీనికి అనుకొని ఉన్నాయి. ఈ రహదారులపై ఏటా రెండు వేలకుపైగా జరిగే రోడ్డు ప్రమాదాల్లో 200-300 మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారు. అనేక మంది వికలాంగులుగా మారుతున్నారు. ప్రధాన నగరంలో ప్రతి 5 కిలోమీటర్లకు ఒక 108 అంబులెన్స్ ఉండగా..అదే శివార్లలో ప్రతి 25-30 కిలోమీటర్లకు ఒకటి ఉంది. ఔటర్‌పై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అంబులెన్స్ ఘటనాస్థలికి చేరుకోవాలంటే కనీసం గంటకు పైగా పడుతోంది. ఘటనా స్థలానికి చేరుకున్న తర్వాత క్షతగాత్రులను ఉస్మానియా, నిమ్స్, గాంధీ ఆస్పత్రులకు తరలించడానికి మరో గంటకుపైగా పడుతోంది. ఇలా ఔటర్ నుంచి ఆస్పత్రులకు బాధితులను తరలించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. వరంగల్, జనగాం, నల్లగొండ, మహబూబ్‌నగర్,మెదక్ జిల్లాల నుంచి వచ్చే ఇతర అంబులెన్స్‌లకు సిటీలో ఇబ్బందులు తప్పడంలేదు. ప్రయాణ దూరానికి రోడ్లపై నిలిచిపోయిన ట్రాఫిక్ తోడవుతుండటంతో అంబులెన్స్‌లు సకాలంలో ఆస్పత్రులకు చేరుకోవడం లేదు.

## ఆ ముగ్గురి అక్రమ ఆదాయం

# నెలకు రూ. అరకోటి

**కూకట్‌పల్లి జోన్‌లో అక్రమ నిర్మాణాలు కోకొల్లలు ■ అక్రమాలకు కేరాఫ్ ఏసీపీ కార్యాలయాలు**



బాలానగర్ జోన్ ప్రతినిధి, అక్టోబరు 17 ప్రభాతవార్త: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయం పరిధిలోని 24,25, 26,27 సర్కిళ్ళలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపులేకుండా పోతుంది. కొందరు ఏసీపీలు వసూల్ రాజాలు మారి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించడం తోపాటు భవన నిర్మాణ అనుమతుల కోసం భారీ ఎత్తున వసూళ్ళకు పాల్ప డుతూ ఒక్కో అధికారి నెలకు రూ.అర కోటికి పైగానే అక్రమంగా సంపాదిస్తున్నట్లు సమాచారం. డిప్యూటీ కమిషనర్ కార్యాలయాలు కూడా అక్రమాలకు నిలయాలుగా మారాయి. ఈ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న కొందరు అధికారులు అక్రమ నిర్మాణాలకు తమ సంపూర్ణ సహకారం అందిస్తూ ఏసీపీలు, టీపీఎస్‌లతో వసూళ్ళకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇళ్ళ నిర్మాణాల అనుమతి కోసం టీఎస్‌బీపాస్ విధానాన్ని రాష్ట్ర పభుత్వం ప్రవేశపెట్టింది. అయితే టీఎస్‌బీపాస్ విధానానికి కొందరు ఏసీపీలు, టీపీఎస్‌లు తూట్లు పొడుస్తూ మామూళ్ళ కోసం దరఖాస్తుదారులను ముప్పు తిప్పలు పెడుతున్నా రు. అదే విధంగా పెద్దఎత్తున పెరుగుతున్న నిర్మాణాలకు అనుగుణంగా జిహెచ్‌ఎంసి ఆదాయం కూడా పెరుగాల్సి ఉంటుంది. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగంలోని కొందరు అధికారులు చేతివాటానికి అలవాటుపడి అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందించి గ్రేటర్ ఆదాయానికి గండికొడు తున్నారు. అక్రమ నిర్మాణాలు చేపడితే అధికారులు నియమించుకున్న వ్యక్తులు అక్కడ చేరి సర్కిల్ కార్యాలయాల్లో అధికారులను కలువాలని హుకుం జారీ చేస్తారు. ముడుపులు అప్పగిస్తేనే అక్రమ నిర్మాణం సక్రమంగా కొనసాగుతుంది. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ సర్కిళ్ళలోని పలు ప్రాంతాల్లో అనేక మంది టీఎస్‌బీపాస్‌తో అనుమతి తీసుకుని నిబంధనలకు విరుద్ధంగా ఐదారు అంతస్తుల్ని నిర్మిస్తున్నా ఇక్కడ కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఏసీపీలతో పాటు టీపీఎస్‌లు అడ్డుకోవడంలేదు. టీఎస్‌బీపాస్‌తో అనుమతి తీసుకుని అందుకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సదరు భవనాల్ని కూల్చివేయవచ్చు. పలు ప్రాంతాల్లో వెలుస్తున్న కమర్షియల్ భవనాలతోపాటు ఐదారు అంతస్తుల వరకు వెలుస్తున్న అక్రమ అపార్ట్‌మెంట్ల నిర్మాణాలకు ఏసీపీలతోపాటు టీపీఎస్‌లు అక్రమ నిర్మాణాలకు ప్రోత్సహిస్తు న్నట్లు కొందరు డిప్యూటీ కమిషనర్లపై కూడా ఆరోపణలు వస్తున్నాయి. భవన నిర్మాణాల అనుమతులకు ఓ రేటు అ క్రమ నిర్మాణాలకు మరో రేటు వసూలు చేస్తున్న కొందరు అధికారులకు కమర్షియల్ భవనాలు కామధేనువులా మారి రూ. కోట్లు కురిపిస్తున్నాయి. పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం అధికమవుతున్నది. బిల్డర్లు ఓ వైపు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా మరో వైపు తీసుకున్న అనుమతులకు విరుద్ధంగా నిబంధన లకు పాతరేసి అడ్డగోలుగా అనుమతులు సాధించి బహుళ అంతస్తుల భవనాల్ని బిల్డర్లు చక చకా నిర్మించేస్తున్నారు. స్వయంగా జిహెచ్‌ఎంసి కమిషనర్ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని ఆదేశిస్తున్నా కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోకుండా జేబులు నింపుకోవడానికే పరిమితం అయ్యారు. ఏసీపీ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న కొందరు అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ బిల్డర్లు, అక్రమ నిర్మాణదారులకు తమ వంతుసహకారం అందిస్తుండడంతో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు కుప్పలు తెప్పలుగా వెలుస్తు న్నాయి. అక్రమ కమర్షియల్ బహుళంతస్తుల నిర్మాణాలతో పాటు జీప్లస్ టూ వరకు అనుమ తులు తీసుకుని ఐదారు అంతస్తులు నిర్మిస్తున్న అక్రమ నిర్మాణదారులతో పాటు బిల్డర్లతో కుమ్మక్కైన టౌన్‌ప్లానింగ్ అధికారులు కోట్లు దండుకుంటూ జేబులు నింపుకోవడానికే పరిమితం అయ్యారు. సామాన్య , మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు అనుమతుల కోసం వెళితే లేనిపోని నిబంధనలు చెప్పి ఇబ్బందులు పెట్టే అధికారులు బిల్డర్లు చేపుడుతున్న అ క్రమ వాణిజ్య భవనాల విషయంలో ఎందుకు చూసీ చూడనట్టుగా వ్యవహరిస్తు న్నారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలు పాటించని వారిపై కొరడా ఝులిపిస్తామని ప్రకటనలు గుప్పిస్తున్న అధికారులు ఆచరణలో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నారు. బిల్డర్ల మాయమాటలకు ఆకర్షితులై అపార్ట్‌మెంట్లలో ప్లాట్లను కొన్న తర్వాత అందులో సదుపాయాలు లేక కొనుగోలు దారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. పార్కింగ్ కోసం స్థలం లేకపోవడంతో వాహనాలు బయటనే పార్కింగ్ చేయాల్సిన పరిస్థితి. వ్యాపార సంస్థలకు వచ్చే కొనుగోలుదారులు వారు తమ వాహనాలను రోడ్ల మీదనే పార్కింగ్ చేయాల్సిన పరిస్తితి నెలకొంది. నిత్యం ట్రాఫిక్ సమస్యలతో స్థానికులతోపాటు కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి భవనాల వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నా నిబంధనలు పాటించ కుండా కొత్తగా నిర్మించే కమర్షియల్ భవనాల్ని అడ్డుకోవడంలో అధికారులు ఎందుకు దృష్టి సారించడంలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారుల ధన దాహం కారణంగానే అక్రమ అపార్ట్‌మెంట్లు, నిర్మాణాలు పెద్దఎత్తున వెలిశాయి. జిహెచ్‌ఎంసి నిబంధనల్ని అతిక్రమించినా సరే కొందరు టౌన్‌ప్లానింగ్ అధికారులు నిర్ణయించిన ముడుపులు ముట్టచెబితే అక్రమ అపార్ట్‌మెంట్లు అయినా, నిర్మాణాలకయినా వెంటనే అధికారుల ఆమోద ముద్రపడుతుంది. దీన్ని బట్టి కొందరు టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు జేబులు నింపుకోవడానికే మాత్రమే పరిమితమవుతున్నారని అర్థమవుతుంది.

**ఆ ముగ్గురి అక్రమ ఆదాయం నెలకుఅర కోటికి పైగా**

గాజులరామారం, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి సర్కిళ్ళలోని ఏసీపీ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తోన్న ఓ ముగ్గురు అధికారులు తమకు అడ్డే లేదన్న ధీమాతో వ్యవహరిస్తూ బిల్డర్ల అక్రమ నిర్మాణాలకు తమ వంతు సహకారం అందిస్తూ మధ్యవర్తులు, లైసెన్స్ ప్లానర్లతో అక్రమ వసూళ్ళకు పాల్పడుతూ నెలకు రూ.అరకోటికిపైగానే అక్రమార్జనకు పాల్పడు తున్నట్లు అధికారులపై ఆరోపణలు ఉన్నాయి. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దృష్టిసారిస్తే ఓ వైపు గ్రేటర్ ఆదాయాన్ని కొల్లకొడుతూ మరో వైపు మామూళ్ళ కోసం ప్రజలు, బిల్డర్లని ముప్పు తిప్పలు పెడుతున్న అక్రమార్కుల అవినీతి గుట్టు బయటపడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

## నడి రోడ్డుపై యువతి హల్‌చల్

**కారు తగిలిందనే కోపంతో రెచ్చిపోయిన యువతి**

**అసభ్యపదజాలంతో డ్రైవర్‌పై చెప్పుతో దాడి.. నిలదీసిన ప్రజలు**

సరూర్‌నగర్, అక్టోబర్ 17 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలో నడి రోడ్డుపై ఓ మహిళ రెచ్చిపోయి ప్రవర్తించింది. తాను వెళ్తున్న కారుకు మరో కారు తగలడంతో ఆగ్రహించిన సదరు మహిళ అసభ్య పదజాలంతో సదరు కారు డ్రైవర్‌ను దూషించడమే కాకుండా ఏకంగా నడి రోడ్డుపై చెప్పుతో కొట్టి దురుసుగా ప్రవర్తించింది. అయితే రోడ్డుపై మహిళ చేస్తున్న హల్‌చల్‌ను గమనించిన పలువురు ఆమెను నిలదీశారు. దీంతో ఆమె కూకట్‌పల్లి ఇన్స్‌పెక్టర్ నా మామ అంటూ తనను నిలదీసిన వారితో వాగ్వివాదానికి దిగింది. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన పోలీసులు కారుతో సహా స్టేషన్‌కు తరలించి న్యూసెన్స్ కేసును నమోదు చేశారు. ఈ సంఘటన శివార్లలోని మీర్‌పేట్ పోలీ స్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం రాత్రి కర్మన్‌ఘాట్ సమీపంలోని టికెఆర్ కమాన్ ఎదురుగా ఉన్న రోడ్డు నుండి వెళ్తున్న టిఎస్ 07 జిఎల్ 9691 అనే నెంబర్ గల కారుకు అనుకోకుండా వెనుక నుండి వచ్చిన ఓ ఇన్నోవా కారు తగిలింది. దీంతో కారు నుండి దిగిన ఓ మహిళ రెచ్చిపోయి ప్రవర్తించి జనం చూస్తుండగానే కారు డ్రైవర్‌పై చెప్పుతో దాడి చేసి అసభ్య పదజాలంతో దూషించింది. అంతే కాకుండా పది వేలు తీయాలంటూ బండబూతులు తిడుతూ పోలీస్ స్కిక్కర్ కారు నుండి వచ్చిన మహిళ హల్‌చల్ చేస్తుండడంతో ఓపిక నశించిన పలువురు నిలదీశారు. అదే సమయంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి పోలీస్ స్టిక్కర్ ఉన్న కారును స్టేషన్‌కు తరలించి సదరు మహిళపై న్యూసెన్స కేసును నమోదు చేశారు.

## ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా

**షాక్‌కు గురైన ముగ్గురు బాలురు.. ఒకరి పరిస్థితి విషమం**

సరూర్‌నగర్, అక్టోబర్ 17 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలో విద్యుత్ స్తంభం వద్ద ఆడుకుంటున్న ముగ్గురు బాలురు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కర్మన్‌ఘాట్ శ్రీరమణ కాలనీకి చెందిన అక్షయ్ (12), డి.ఒమనిష్ రెడ్డి (8), మణి (10) స్థానిక శివ శుకృత్ అపార్ట్‌మెంట్ ముందు ఆడుకుంటున్నారు. అయితే అపార్ట్‌మెంట్ ముందు ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభాన్ని ముట్టుకున్న వారు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఇనుప విద్యుత్ స్తంభానికి కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురై తీవ్ర గాయాల పాలైన వారిని స్థానికులు రక్షించడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ముగ్గురు బాలురలో అక్షయ్ పరిస్థితి సీరియస్‌గా ఉందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసును నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



**పంజాగుట్టలో జరిగిన ఫ్యాషన్ షో పాల్గొన్న సినీ నటి వర్షిణి**

## దీపావళీ ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వానం

చార్మినార్, అక్టోబరు 17 ప్రభాతవార్త : రాష్ట్ర అటవీ,పర్యావరణ,న్యాయ,దేవాదాయ శాఖల మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డిని సోమవారం చార్మినార్ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళతో పాటు మందిరం కమిటి ప్రతి నిధులు కలిశారు.చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరంలో నిర్వహించనున్న దీపావళీ మహోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ మంత్రి ఇం ద్రకరణ్‌రెడ్డికి చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మి మందిరం ట్రస్టీ శశికళ ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో మందిరం కమిటి ప్రతినిధులు సూర్యప్రకాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



**రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఎ.ఇంద్రకరణ్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరం ట్రస్టీ శశికళ**

## భౌరంపేటలో మహిళ దారుణ హత్య

దుండిగల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త: ఒంటిరిగా ఉంటున్న ఓ మహిళ దారుణ హత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్‌కు చెందిన యలపర్తి లక్ష్మి(59), నాగేశ్వరరావు దంపతులు గత ఐదేళ్ళ క్రితం నగరానికి వలస వచ్చి దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట ఇందిరమ్మకాలనీ బ్లాక్-3, ప్లాట్-7లో నివాసం ఉంటున్నారు. దంపతులు ఇరువురు కూలీపనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుండే వారు. ఏడాది క్రితం నాగేశ్వరరావు మృతిచెందడంతో అప్పటి నుండి లక్ష్మి ఒంటరిగానే ఉంటుంది. గత నాలుగు రోజులుగా తాళం వేసి ఉన్న లక్ష్మి ఇంట్లో నుండి తీవ్రమైన దుర్వాసన రావడాన్ని గమనించిన ఇరుగుపొరుగు పోలీసులకు సమాచారం అందించారు. తాళం పగులగొట్టి లోపల చూసిన పోలీసులకు లక్ష్మి మృత దేహం కనిపించింది. పరిసరాలను మృతదేహాన్ని పరిశీలించి ఆమె హత్యకు గురైనట్లు నిర్ధారణకు వచ్చి క్లూస్‌టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఆమెను దిండు సహాయంతో ఊపిరి ఆడవని వ్వకుండా చేసి హత్య చేసినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. నాలుగురోజుల క్రితమే హత్య జరిగి ఉండవచ్చునని పేర్కొంటున్నారు. కేసు నమోదు చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.



**లక్ష్మి (ఫైల్)**

**సంత నిర్వహిస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు**

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త : మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు పోలీసు, ట్రాఫిక్ పోలీసు అధికారులు ఆదివారం సాయంత్రం సంత నిర్వహిస్తున్న సనత్‌నగర్ మెయిన్‌రోడ్‌లో పర్యటించారు. సంత కారణంగా తాము అనేక ఇబ్బం దులు పడుతున్నామని సనత్ నగర్ నియోజక వర్గం పరిధిలోని జెక్ కాలనీవాసులు జరిగిన సమావేశంలో మంత్రికి విన్నవించారు.

## రేషన్ డీలర్ల వద్ద లబ్ధిదారుల ఆందోళన

**9 రకాల సరుకుల ఇవ్వడం లేదని మండిపాటు**

**సబ్సిడీ సరుకులు అందజేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**



హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త: రాష్ట్రంలో రేషన్ పంపిణీ అంటే కేవలం బియ్యం మాత్రమేనన్న పరిస్థితి నెలకొంది. ఉమ్మడి రాష్ట్రంలో అమ్మహస్తం పేరుతో 9రకాల సరుకులను తక్కువ ధరలకు రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం అందించేంది. దీంతో ప్రజలకు ధరల భారం నుంచి కొంత ఊరట లభించేంది.కానీ ప్రత్యే రాష్ట్రం ఏర్పడిన తర్వాత రేషన్ సరుకులన్నీ ఇవ్వకపోవడంతో పండగళలవేళ ప్రజలకు ధరల భారం తప్పటం లేదు. ముఖ్యంగా ఒక్కరూపాయకే కిలో బియ్యం అని ఒకరికి అరుకిలోలు ఇస్తున్నామి చెప్పడంతో పేదలు సంతోషించారు. కానీ అప్పటివరకు ఇచ్చిన 9రకాల సరుకుల్లో కోత పెట్టి మొదట బియ్యం, పంచదార, కిరోసిన్ ఇచ్చారు. ఆతర్వాత చక్కెర, కిరోసిన్ ఇవ్వడం ఆపేశారు. ఇలా అన్ని సరుకులను బందుపెట్టి చివరకు బియ్యం మాత్రమే ఇస్తు న్నారు. దీంతో పేద ప్రజలకు ధరల భారం తప్పడంలేదు. ముఖ్యంగా నిత్యావసర సరుకు లైనా పంచదార, కిరోసిన్, గోధుమలు, గోదుమపిండి, కందిపప్పు, పామాయిల్ ఇవ్వడంలేదు. కిలోపంచదార బహిరంగ మార్కెట్‌లో రూ.40ఉంటే రేషన్ ద్వారా బహిరంగ మార్కెట్‌లో అరకిలో 6.75కు లభించేంది. ఇలా సబ్సిడీ ద్వారా కొంత ఉపశమనం ఉండేదని ఇప్పడు బహిరంగ మార్కెట్‌లో సరుకులు కొనలేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు.

**మండుతున్న ధరలు..** గతంలో పండుగ సమసయంలో రేషన్ షాపుల్లో, అదనపు కోటాగా చక్కెర, కందిపప్పు, పామాయిల్ వంటి సరుకులు అందేవి. రేషన్ షాపుల్లో కింలో కందిపప్పు రూ.50కే అందుబాటులో ఉండేది. పామాయ్ చెక్కెర, చింతపండు, కారం కూడా తక్కువ ధరకే లభించేంది. కానీ ఇప్పుడు రేషన్ తప్ప వేరే ఏవీ ఇవ్వడం లేదు. బయట మార్కెట్‌లో కొనాలంటే కిలో కందిపప్పు రూ.110-130 వరకు ఉంది. చెక్కెర కిలో 40, లీటర్ పామాయిల్ రూ.120వరకు ఉంది. సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర 140నుంచి 150వరకు ఉంది. పల్లి నూనెల లీటర్ 160నుంచి 175వరకు ఉంది. ఇలా ఏది కొనాలన్నా ధరలు భగ్గుమం టుండటంతో సామాన్య లకు కష్టాలు తప్పడం లేదు. రాష్ట్రం రాకముందు అభయహస్తం పేరుతో సర్కారు సబ్సిడీ భరించి తొమ్మి రకాల సరుకులను రూ.185కి ఇచ్చేంది. బియ్యంతో పాటు కిలో కందిప్పు, లీటర్ పామాయిల్, కిలో గోధుమ, చింతపండు 250గ్రాముల కారం పొడి, వందగ్రాముల పసుపు, లీటర్ కిరోసిన్ ఇచ్చేవారు.

## బల్కంపేట దేవస్థానం హుండీ ఆదాయం లెక్కింపు

సంజీవరెడ్డి నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త : బల్కంపేట ఎల్లమ్మ పోచమ్మ దేవస్థానంలో సోమవారం ఆలయ హుండీలను 69రోజులగా వచ్చినటువంటి ఆదాయాన్ని లెక్కించారు. సోమవారం ఆలయ ఈఓ ఎస్.అన్నపూర్ణ, ఛైర్మన్ సాయిబాబాగౌడ్, ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్ ఇన్స్‌పెక్టర్ పి.శ్రీదేవి, భక్తులు, బ్యాంక్ ఆఫ్ భరోడా ఎస్సార్‌నగర్ శాఖ అధికారులు పాల్గొని ఆదాయాన్ని లెక్కించారు. సాధారన హుండీలలో కాగితపు నోట్లు 62,04,405 రూపాయలు, నాణెలు 2,16,447 రూపాయలు, అన్నదానం హుండీ 65,335 రూపాయలు మొత్తం హుండీ ఆదాయం 64,86,187 రూపాయల ఆదాయం కాగా, విదేశీ కరెన్సీయుఎస్ డాలర్లు 97, ఆస్ట్రేలియా డాలర్లు 120, యూరోలు 15, యూకె పౌండ్లు 10, యుఎస్‌ఏ దిర్హామ్‌లు 50, ఫిలిప్పైన్ కరెన్సీ 20 వచ్చాయని ఆలయ అధికారులు తెలియజేశారు.

## ఉద్యోగాల పేరుతో మోసం చేసిన నిందితులపై కేసు నమోదు

పేట్‌బషీరాబాద్, అక్టోబర్17 ప్రభాతవార్త: టీఎస్ఎస్‌పిడీసీఎల్‌లో అసిస్టెంట్ ఇంజనీర్, జెఎల్ఎం, సబ్‌ఇంజనీర్ ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని 17మంది భాదితుల నుంచి డబ్బు వసూలు చేసి మోసం చేసిన నిందితులపై ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం ప్రాంతానికి చెందిన స్టాన్లీ డేవిడ్ భార్య సరోజిని(61),మదీనగూడకు చెందిన సత్యనారాయణ కుమారుడైన విశ్వపతి అజయ్‌కుమార్(38) ఇద్దరు నిందితులు ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని 17 మంది నిరుద్యోగుల నుంచి సుమారు రూ.80లక్షలు వసూలు చేసి పరారయ్యారు. భాదితులు పలుమార్లు ఫోన్లు చేసినా పట్టించుకోకపోవడంతో మోసపోయామని గుర్తించిన భాదితుల్లో ఒకరైన ఆకుల దిలీప్(27) గాయత్రినగర్ నివాసి ఆదివారం పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు నిందితులపై ఐపీసీ సెక్షన్ 420 కింద కేసు నమోదు చేశారు.

## డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ పార్టీ మారుతున్నారంటు తప్పుడు ప్రచారం

**ఖడించిన టీఆర్ఎస్ నేతలు, చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు**

సికింద్రాబాద్, అక్టోబర్ 17 ప్రభాతవార్త : సోషల్ మీడియాలో డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ టీఆర్ఎస్ పార్టీ మారుతున్నట్లు తప్పుడు ప్రచారం జరుగుతోందని, ప్రజలు విశ్వసించవద్దని టీఆర్ఎస్ సికింద్రాబాద్ నియోజకవర్గం సమన్వయకర్తలు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, రాజా సుందర్‌లు తెలిపారు. సోమవారం చిలకలగూడ పోలీసులను ఆశ్రయించి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యతం ప్రజలకు అందుబాటులో ఉంటు వారి సమస్యల పరిష్కారంకోసం చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌పై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాజకీయంగా ఆకాశమంత ఎదుగుతుండడంతో పాటు నియోజకవర్గంలోని ప్రతీ కుటుంబ సభ్యుడిగా ఆధరణ పొందుతుండడాన్ని జీర్ణించుకోలేని స్వార్థపనులు ఇలా తప్పుడు ప్రచారం చేయడం తగదన్నారు. కుటుంబంలోని నలుగురు కుమారులతో పాటు ప్రజల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ప్రతి ఒక్కరికి అండదండగా ఉంటున్న పద్మారావు గౌడ్‌పై ఇలా తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని అన్నారు. డిప్యూటీ స్పీక ర్ పద్మారావు గౌడ్ పార్టీని విడే ప్రసక్తే లేదని, వీడాల్సి వస్తే ఏ పార్టీలో చేరకుండా కేవలం కుటుంబ సభ్యులతో గడుపుతారు తప్ప ఇతర ఏ పార్టీలో చేరరని పేర్నొన్నారు. పద్మారావు గౌడ్‌పై తప్పుడు ప్రచా రం చేసిన వారు అభాసుపాలు కావాల్సిందే తప్ప అంతకంటే ఏమీ సాధించలేరని చెప్పారు. తప్పుడు ప్రచారం చేస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

## అనుమానాస్పదస్థితిలో విద్యార్థి మృతి



దుండిగల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త : అనుమానస్పదస్థితిలో ఓ విద్యార్థి చెరువులో శవమై తేలిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఆదిలాబాద్ జిల్లా, నార్నూర్ మండలం, గంగాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ రాజశేఖర్ కుమారుడు రాథోడ్ రోహిత్(21) నగరశివారు దుండిగల్‌లోని ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. గండిమైసమ్మలోని బిఆర్ బాయ్స్‌హాస్టల్‌లో నివాసం ఉంటూ రోజు కళాశాలకు వెళ్తుండేవాడు. ఈనెల 14 ఉదయం నుండి రోహిత్ కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు తెలిసిన చోట్ల ఆరా తీసిన ఫలితం లేకపోవడంతో ఈనెల 16న దుండిగల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. అయితే సోమవారం ఉదయం డి.పోచంపల్లి పరిధి కుడికుంటలో యువకుడి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకొని మృతదేహాన్ని వెలికితీయించారు. మృతుడు నాలుగురోజులుగా కనిపించకుండా పోయిన రోహిత్‌గా గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుని తల్లిదండ్రులు తమ కుమారుడు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు, తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తెలుపుతున్నారు. అనుమానస్పదమృతి కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నివేదిక ఆధారంగా దర్యాప్తు చేపట్టనున్నట్లు పేర్కొంటున్నారు. కాగా ఓ విషయంలో తనతో పాటు రూమ్‌లో ఉంటున్న స్నేహితులకు రోహిత్‌కు మధ్య గొడవ జరిగిందని, మరుసటిరోజు తెల్లవారుజామున 3గంటల సమయంలో రోహిత్ రూమ్ నుండి బయటకు వెళ్ళినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

# హిందూ స్మశాన వాటికలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని చనిపోయిన పెద్దలను, బంధువులను స్మరించుకునేందుకు వచ్చే వారికి స్మశాన వాటికలలో ప్రత్యేక ఏర్పాట్లను చేయాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ బోర్డు సిఈఓ అజిత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సోమవారం బోయిన్‌పల్లి, కార్ఖాన పరిసర ప్రాంతాల్లోని హిందూ స్మశాన వాటికల్లో ఆయన పర్యటించారు. దీపావళి సందర్భంగా స్మశానవాటికల వద్ద లైటింగ్, మంచినీరు, క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలని ఇంజనీర్లకు సూచించారు.

# కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలి : మహేశ్వర్ రెడ్డి

## - నామినేటెడ్ మెంబర్ డ్రామాలు మానుకోవాలని మాజీ బోర్డు సభ్యులు డిమాండ్

**కంటోన్మెంట్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజా సమస్యలు పూర్తిగా కుంటుపడుతున్నాయని, బోర్డు ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి తెలిపారు. సోమవారం బోయిన్‌పల్లిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో జె.ఎం.ఆర్. మాట్లాడుతూ నామినేటెడ్ మెంబర్‌గా కొనసాగుతున్న జె.రామక్రిష్ణ ఏడు సార్లు బోర్డు మీటింగ్‌లు నిర్వహించి 500 పెండింగ్ పనుల అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు చేయించడం లేదని ఆయన తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు పాలకమండలి సభ్యుల పదవి కాలం ముగిసిసి రెండు సంవత్సరాలు కావస్తున్నా బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవ దంతో కోర్టును ఆశ్రయించినట్లు ఆయన తెలిపారు. కంటోన్మెంట్ బోర్డు ఉపాధ్యక్షునిగా మూడున్నర సంవత్సరాలు, రెండు పర్యాయాలు నామినేటెడ్ మెంబర్‌గా పనిచేస్తున్న జె.రామక్రిష్ణ ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమైయ్యారన్నారు. బోయిన్‌పల్లి, సౌజన్య కాలనీ, బాపూజీ నగర్, రామన్న కుంట చెరువు పరిసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్నట్లు కొబ్బరి కాయలు కొట్టడం తప్పా అభివృద్ధి పనులు జరగడం లేదన్నారు. బోర్డు సభ్యుడు రామక్రిష్ణ చేసే డ్రా మాలు మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యుడు లోనాధం, నళిని కిరణ్, పి. శ్యామ్‌కుమార్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు

# కంటోన్మెంట్ బోర్డు అభివృద్ధికి నిరంతరం కృషి : రామక్రిష్ణ

**కంటోన్మెంట్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని సివిలియన్ నామినేటెడ్ మెంబర్ జె.రామక్రిష్ణ తెలిపారు. సోమవారం 1వ వార్డు పెద్ద తోకట్టలో లక్షలాది రూపాయల వ్యయంతో సీసీరోడ్డు నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఆర్.కె. మాట్లాడుతూ కంటోన్మెంట్ బోర్డు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బిజెపి ఆధ్వర్యంలో బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బానుక మల్లికార్జున్, బాణాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న బోర్డు సభ్యుడు రామక్రిష్ణ

# దళిత బంధు పథకంతో దళితులు అభివృద్ధి చెందాలి

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** దళిత బంధు పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల జీవితాలలో వెలుగునింపారని హైదరాబాద్ జిల్లా టిఆర్ఎస్ అధ్యక్షులు జూబ్లిహిల్స్ శాసన సభ్యులు మాగంటిగోపినాథ్ అన్నారు. సోమవారం దళిత బంధు పథకం ద్వారా లబ్దిదారులు చిన్న రమేష్‌కు మంజూరైన టెంట్ హౌస్‌ను కళ్యాణ్‌నగర్ చౌరస్తాలో స్థానిక కార్పోరేటర్ దేదీప్యవిజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమేల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడ లేని విధంగా దళిత బంధు పథకం ప్రవేశపెట్టారని అన్నారు. దళిత బంధు పథకం ద్వారా దళితుల జీవితాలలో వెలుగు నింపారని తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న పథకాలు దేశంలో ఏరాష్ట్రంలో కూడా లేవన్నారు. ఈసందర్భంగా దళిత బంధు లబ్దిదారుడు చిన్నరమేష్ మాట్లాడుతూ తమకు దళిత బంధు ద్వారా జీవనోపాదిని అందజేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ స్థానిక శాసన సభ్యులు మాగంటిగోపినాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో డివిజన్ కార్పోరేటర్ దేదిప్య, శ్యామ్‌రావు ముదిరాజ్, వేణుగోపాల్ యాదవ్, గజ్జల బాలకృష్ణ, పవన్‌ముదిరాజ్, సత్యనారాయణ, శ్రీకాంత్, కిట్టు, తదితరులు పాల్గొన్నారు.


టెంట్‌హౌస్ ప్రారంభిస్తున్న మాగంటిగోపినాథ్

# విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయులపై ఉంది

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే భాధ్యత ప్రతి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులకు ఉంటుందని ఏపి బిసి సంక్షేమం అయ్యంపిఆర్, సినిమాటోగ్రఫీ శాఖమంత్రి చందుబోయిన శ్రీనువాస వేణుగోపాల కృష్ణ అన్నారు. ఈ సందర్భంగా గోదావరి టాలెంట్ టెస్ట్ 2022గాను విజయ తల పురస్కార ప్రదానోత్సవంలో భాగంగా కన్వీనర్ గోదావరి టాలెంట్ ట్రస్ట్ ఎస్‌పి గంగిరెడ్డి ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిదిగా మంత్రితో పాటు రాష్ట్ర మహిళ కమిషన్ చైర్ పర్సన్ వాశిరెడ్డి పద్మ కూడా పాల్గొని ఈఅవార్డును అందజేశారు. తన సేవలను గుర్తించి ఇలాంటి ప్రోత్సాహక అవార్డులను ఉపాధ్యాయులకు అందజేయడం తమకెంతో ఆనందంగా ఉందని శ్రీనువాస్ పేర్కొన్నారు.


అవార్డును అందజేస్తున్న దృశ్యం

# సీఎం సహాయ నిధి పేదలకు వరం : ప్రకాశ్‌గౌడ్

**నార్సింగి, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** సీఎం సహాయ నిధితో నిరుపేదలు కార్పోరేట్ వైద్యంను పొందుతున్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం నార్సింగి మున్సిపల్ పరిధిలోని ఖానాపూర్ గ్రామానికి చెందిన మౌనికకు రూ.29.500, సుశీలకు రూ.36. వేలు, అనంతరెడ్డికి రూ.60.వేల సీఎం సహాయ నిధి చెక్కులను మాజీ ఎంపిపి తలారి మల్లేష్ ముదిరాజ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య పాలనలో పెద్ద జబ్బులు వస్తే నిరుపేదలు దేవుడిపై భారం వేసి బాధపడుతూ ఉండే వారని, స్వరాష్ట్రం వచ్చాక సీఎం కేసీఆర్ అర్హులందరికి సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందించి నిరుపేదల ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. గతంలో ఉన్న నిధిని రెట్టింపు చేసి నిరుపేదలందరికి కార్పోరేట్ వైద్యం అందించాలని, సకాలంలో అత్యవసర చికిత్సలు అందించాలని సీఎం ఆదేశించారన్నారు. హారీష్‌రావ్ ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తరువాత సర్కారు దవాఖానాలలో మెరుగైన వైద్యం అందుతుందన్నారు. నిధులను పెంచి అత్యాధునిక పరికరాలు కొని అందుబాటులో ఉంచుతున్నారని, అవసరమైన అన్ని రకాల వైద్య పరీక్షలు చేసేందుకు సైతం మిషనరీలు అందించారన్నారు. బస్తీ దవాఖానాలు నిరుపేదలకు చాలా ఉపయుక్తంగా మారాయని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తెలిపారు.


సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేస్తున్న ప్రకాశ్‌గౌడ్

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డిసిపి

**బేగంపేట, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ప్రాణం ఎంతో విలువైందని, వాహనాలపై ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు క్షేమంగా తిరిగి ఇల్లు చేరాలంటే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అలాగే ద్విచక్ర వాహన దారులైతే హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారైతే తప్పక సీటు బెల్టు ధరించి వాహనాలు నడపాలని డీసీపీ ట్రాఫిక్ ఎన్.ప్రకాష్‌రెడ్డి వాహన దారులకు సూచించారు. సోమవారం మహంకాళీ పోలీసుల ఆధ్వర్యంలో సేఫ్టీ మరియూ ట్రాఫిక్‌పై అవగాహనా కార్యక్రమాన్ని ప్యాట్నీ సమీపంలోని ఎస్‌విఐటీలో పిపిటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డీసీపీ ప్రకాష్‌రెడ్డి ట్రాఫిక్‌లో ప్రయాణం చేస్తున్న సమయంలో వాహన దారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విధ్యార్థులు విధిగా వాహనాల్లో ప్రయాణిస్తున్న సమయంలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట అడిషినల్ డీసీపి ట్రాఫిక్ సాలె రంగారావు, ఏసీపీ గంగారెడ్డి, శంకరరాజు, ఇన్స్ పెక్టర్లు నాగరాజు, బి.నర్సింహ, సిబ్బంది విధ్యార్థులు పాల్గొన్నారు.


హెల్మెట్ లను అందిస్తున్న డీసీపీ ప్రకాష్‌రెడ్డి

# ఆర్టీసీ సిబ్బందిపై దాడులు నిర్వహిస్తే చర్యలు తప్పవు

**కంటోన్మెంట్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించేందుకు ఆర్టీసి డ్రైవర్, కండక్టర్లు రాత్రింభవళ్లు కృషి చేస్తున్నారని, అటువంటి వారిపై దాడులు జరిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కంటోన్మెంట్ డిపో మేనేజర్ ఎల్.రాంమోహన్ తెలిపారు. సోమవారం జెబిఎస్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శుభకార్యాలకు, పండగలకు, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రాత్రింభవళ్లు బస్ సర్వీస్‌లు నడుపుతుంటే విధి నిర్వాహనలో ఉన్న డ్రైవర్, కండక్టర్లపై కొందరు వ్యక్తులకు దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై బసు ్సలను నడుపుతుండగా రోడ్డుపైన కానీ, ప్రయాణికులకు కానీ తమ సిబ్బందితో పొరపాట్లు జరిగితే ఆర్టీసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. క్షణికావేశంతో విధి నిర్వాహనలో ఉన్న డ్రైవర్,కండక్టర్లపై దాడులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఇటీవల కంటోన్మెంట్ డిపోకు ఇలాంటి ఘటనలు జరిగాయన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సంఘటనలు జరుగకుండా ప్రయాణికులు,వాహన చోదకులు, వాహన చోదకులు విధి నిర్వాహనలో ఉనన ఆర్టీసి సిబ్బందిపై దాడులు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సుఖేందర్ రెడ్డి, కంట్రోలర్లు నర్సింహ్మా, ఆర్.ఎస్. రెడ్డి, నర్సయ్య, పబ్బ శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే


పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు

**నేరేడ్‌మెట్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మల్కాజిగిరి నియోజకవర్గంలోని డివిజన్లను పూర్తి స్థాయిలో చేస్తానని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు పేర్కొన్నారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని మౌలాలి డివిజన్ పరిధిలోని ఆర్‌టిసి కాలనీ, పిల్లి నర్సింగ్ రావు కాలనీ, షఫీనగర్, జిఎస్‌ఆర్ గార్డెన్, బృందావన్ కాలనీ, ప్రగతి నగర్, చందాబాగ్, వడ్డెర బస్తి, ఎస్‌పి నగర్‌లలో సీసీ రోడ్డు పనులు, సాదుల్లానగర్, గ్రేవీయార్ట్ దగ్గర కంపౌండ్ వాల్ పనులు, భాగ్యద్రి దగ్గర సీసీ రోడ్డు పనులను రూ. 3కోట్ల 25లక్షలతో నిధులతో అభివృద్ధి పనులను అధికారులు, స్థానిక నాయకులతో కలసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. ప్రజలు తనపై పెట్టకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి కోసం నిరతంరం పాటు పడతానన్నారు. అంతేకాకుండా నియోజకవ ర్గ పరిధిలోని డివిజన్లలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డీసి రాజు, ఈఈ లక్ష్మణ్, డిఇ మహేష్, ఏఈ మదులత, జలమండలి జీఎం సునీల్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, అమీనుద్దీన్, టిఆర్ఎస్ నాయకులు జీఎన్‌వి సతీష్ కుమార్, రాము యాదవ్, భాగ్యనంద్, సత్తయ్య, మంద భాస్కర్, సంతోష్ నాయుడు, ఆదినారాయణ, పూలపల్లి జగదీష్ యాదవ్, ఇబ్రహీం, చందు, మోహన్, సంతోష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలను ప్రదానం చేసిన దృశ్యం

# మూఢనమ్మకాలను నిర్మూలించే విధంగా కథలు రావాలి

## - జస్టిస్ రాధారాణి

**చిక్కడపల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మూఢనమ్మకాలను నిర్మూలించే విధంగా కథలు రావాల్సిన అవసరం ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ జి.రాధారాణి అన్నారు. ఆరాధన సంస్థ అధినేత లోకం కృష్ణయ్య, విజయలక్ష్మి శెట్టి సౌజన్యంతో 'ఆరాధన టీవీ పురస్కారాల' ప్రదానోత్సవ కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా జస్టిస్ రాధారాణి హాజరై ఈ పురస్కారాలను అందించి గౌరవించారు. సన్మానకర్తగా రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు పూర్వ అదనపు కమిషనర్ సిఎల్ఎన్.గాంధీ వ్యవహరించగా సభకు గంగోత్రి గో నిలయం అధినేత జి.హనుమంతరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా బిజెపి వరంగల్ పార్లమెంట్ కోకన్వీనర్ ఇనుగాల విజయేందర్‌రెడ్డి, యువకళావాహిని సంస్థ అధినేత, వ్యాఖ్యానబ్రహ్మ లంక లక్ష్మినారాయణ, ఆర్య లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిల్లా రాజశేఖరరెడ్డి, ఎపి. ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, కుసుమ కమలారత్నం మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కుసుమ భోగరాజు, ఎల్ఐసి ఎంప్లాయిస్ యూనియన్ ఆలిండియా లీడర్ టి.సూరి కుమార్, బిజెపి రాష్ట్ర నేత బొట్ల శ్రీనివాస్, ఆహ్వానకమిటీ సభ్యులు వి.వి.నిరంజన్, ఎం.ఎ.హమీద్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరాధన జీవిత సాఫల్య పురస్కారాలను మేకా రామకృష్ణ, ఢిల్లీ రాజేశ్వరి, బ్యూరోఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పి.నాగేంద్రకుమార్‌లకు అందజేశారు. సాయిలలిత మ్యూజిక్ అకాడమి నిర్వాహకులు టి.వి.రావు, లలితారావు ఆధ్వర్యంలో గాయనీ గాయకులు వినోద్‌బాబు, బాలకామేశ్వరరావు, సంపత్‌కుమార్, విజయలక్ష్మి శెట్టి, డి.స్వర్ణలత ఆలపించిన పాటలు అందరిని మంత్రముగ్దులను చేశాయి. కరవోకే సహకారాన్ని సుదర్శన్ అందించారు.

# ఇంజనీరింగ్ కాలేజ్ ప్రొ. ఉమామహేశ్వర్ వనమాలకు ప్రతిష్టాత్మక లీడర్ షిప్ అవార్డు

**తార్నాక, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ఉస్మానియా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రొ. ఉమా మహేశ్వర్ వనమాలకు సొసైటీ ఆఫ్ ఆటోమోటీవ్ ఇంజనీర్స్ సౌత్ ఇండియా విభాగం నుంచి ప్రతిష్టాత్మక లీడర్ షిప్ అవార్డును అందుకున్నారు. ఎస్ఏఇ ఇండియాకు విశిష్ట సేవలందించినందుకు ప్రొ. ఉమామహేశ్వర్‌కు లీడర్ షిప్ అవార్డు దక్కింది. ఈ మేరకు చెన్నైలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొఫెసర్ వనమాలకు ప్రదానంచేసి ఘనంగా సత్కరించారు.


ఆవార్డు తీసుకుంటున్న ప్రొ. ఉమామహేశ్వర్ వనమాల

# మాజీ సిఎం చంద్రబాబును కలిసిన టిడిపి నేతలు

**చిక్కడపల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడును సికింద్రాబాద్ పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు పి.సాయిబాబా, నగర ప్రధాన కార్యదర్శి పి.బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దోజు రవీంద్రచారి కలిశారు. ఈ సందర్భంగా ఆరు నెలలుగా పార్టీ చేపట్టిన కార్యక్రమాలను చంద్రబాబుకు వివరించారు. ఈ సందర్భంగా గత మహానాడు తర్వాత నగరంలో చేపట్టిన నిరసనలు, టిఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా చేపట్టిన కార్యక్రమాలను వివరించగా చంద్రబాబు సంతృప్తి వ్యక్తం చేశారు.


చంద్రబాబును కలిసిన సాయిబాబా, బాల్‌రాజ్‌గౌడ్

# సాయివిహార్‌నగర్‌లో ఘనంగా బాబా మహా సమాధి ఉత్సవాలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** నగర శివార్లలోని మీర్‌పేట్ సీతాహోమ్స్ సాయివిహార్‌నగర్ కాలనీలో శ్రీ షిర్డీ సాయిబాబా 104వ మహా సమాధి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ భజన గాయకుడు ప్రమోద్ మేడి ఆధ్వర్యంలో భజన, హారతి కార్యక్రమాలు జరిగాయి. అనంతరం షిర్డీ సాయిబాబా జీవిత చరిత్రపై వక్తలు ఉపన్యసించారు. మహా సమాధి ఉత్సవాల సందర ్భంగా ప్రముఖుల సన్మానాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జిల్లెల అరుణ ప్రభాకర్‌రెడ్డి, ఉదయ్‌రాజ్, శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాసన్, బాలాజీ చెట్టియార్, పిడమర్తి రమ ణ, పినాకపాణి శర్మ, జనార్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న భక్తులు


సన్మానిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

# కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీకి ఆత్మీయ సత్కారం

**నాచారం, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** కాప్రా ప్రెస్ క్లబ్ నూతన కమిటీని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సోమవారం ఘనంగా సత్కరించారు. ఉదయం మల్లాపూర్ వార్డు కార్యాలయంలో ఏర్పాటు ఆత్మీయ సత్కారానికి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి విచ్చేసి కాప్రా నూతన అధ్యక్షుడు శనిగరం అశోక్, ప్రధాన కార్యదర్శి గడ్డమీది బాల్‌రాజ్ గౌడ్, కో షాధికారి బాల్‌రెడ్డి తధితరులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాత్రికేయులు ఘనంగా సత్కరించారు.

# తమ భూమిలో చేపడుతున్న నిర్మాణాన్ని నిలిపివేయాలి

## - వంగవెంకట్‌రెడ్డి

**తార్నాక, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** తమ పట్టాభూమిలో ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణం పనులను నిలిపివేసి తమ భూమిని తమకు అప్పగించాలని కోరుతూ తార్నాక ఎర్రగుంట చెరువు స్థలంలో సోమవారం వంగ వెంకట్‌రెడ్డి నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మారెడ్‌పల్లి మండలం పరిధిలోని లాలాగూడ విలేజ్ సర్వేనెం. 124లోతాము హిమాయత్ నావాబ్ జంగ్ కుమారుల వద్ద సుమారు 4ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేశామని 1965 వ సంవత్సరం నుంచి 2000 వరకు తాము ప్రభుత్వానికి టాక్స్ చెల్లిస్తున్నామని వారు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఎన్ఓసీ కోసం కలెక్టర్, చీఫ్ సెక్రటరీ, ఆర్డీఓలకు ధరఖాస్తు చేసుకున్నామని చెప్పారు. అయితే సదరు భూమికై హైకోర్టు, సికింద్రాబాద్ కోర్టులల్లో కేసు నడుస్తున్నప్పటికి అకస్మాత్తుగా ఇరిగేషన్ అధికారులు ఏవిధంగా భూమిని చదును చేసి అభివృద్ధి చేపడుతారని ఆయన ప్రశ్నించారు. ఇటి విషయంపై తాము న్యాయపోరాటం చేస్తామని వారు హెచ్చరించారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని వారు కోరారు.


ఎర్రగుంట చెరువు స్థలంలో నిరసన వ్యక్తం చేస్తున్న వంగవెంకట్ రెడ్డి తదితరులు

# మౌళిక వసతుల కల్పనే లక్ష్యం

**నార్సింగి, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** బండ్లగూడ జాగిర్ కార్పోరేషన్‌లో మౌళిక వసతుల లక్ష్యంగా పనులు నిర్వహిస్తు న్నామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్‌తో కలిసి కార్పోరేషన్ పరిధిలోని 6,7,8,12,21. వార్డులలో రూ.2.కోట్ల 22. లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపెడుతున్నామన్నారు. చేసేదే చెప్పడం, చెప్పింది చేయడం టీఆర్ఎస్ పార్టీ నాయకులకే చెల్లిందన్నారు. చేతగాని హామీలిచ్చి ముఖం చాటేయడం మాకు రాదని తెలిపారు. ముఖ్యంగా తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజి, వీధి దీపాలు, స్మశాన వాటికలు, పార్కులు, జిమ్‌లు వంటి మౌళిక వసతుల కల్పనకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల, మత, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. కార్పోరేటర్లు, అధికారులంతా సమిష్టి నిర్ణయాలు తీసుకొని బండ్లగూడ కార్పోరేషన్‌ను వేగంగా అభివృద్ధి చేస్తుండడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు ఏ చిన్న సమస్య ఉన్నా ముందు స్థానిక కార్పోరేటర్ల దృష్టికి తీసుకెళ్లాలని, వారు స్పందించకుంటే నేరుగా కార్పోరేషన్ కార్యాలయంకు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ వేణుగోపాల్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షులు రాందాస్, టీఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్ గౌడ్, కార్పోరేటర్లు అనితా వెంకటేష్, పద్మావతి పాపయ్య యాదవ్, రాము, సాగర్‌గౌడ్, భూగపాల్‌గౌడ్, సీనియర్ నాయకులు నాగరాజు, గోపాల్, రజాక్, ఖాజా, సుమన్‌గౌడ్, సుందర్‌గౌడ్, రాజు నాయక్, మల్లేష్ యాదవ్, అంతారం నరేష్, విష్ణువర్ధన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

# సుంకరి ఆనంద్‌కు ఎపిజె అబ్దుల్‌కలాం అవార్డు ప్రదానం

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** సామాజికవేత్త తెలంగాణ రాష్ట్ర పెరికకుల కో.ఆ.సొసైటీ ఆర్థికకార్యదర్శి సుంకరి ఆనంద్‌కు భారతరత్న డా.ఎపిజె అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డు 2022 లభించింది. నాంపల్లి పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారు వెణుగోపాలచారి, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, తదితరులు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. కాగా సృజన ఆర్ట్స్, నేత్రిక ఆర్ట్స్ సాంస్కృతిక సంస్థలు 1996 నుంచి సమాజ శ్రేయస్సు ధ్యేయంగా విశేష కృసి చేస్తున్న కవులు,కళాకారులు, విద్యా, ఎవేత్తలకు ప్రతి ఏఆటా అవార్డులు ప్రదానం చేస్తుంది. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ అధ్యక్షులు శివరాత్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


అవార్డు అందజేస్తున్న వేణుగోపాలచారి,దైవజ్ఞశర్మ

# ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో నవభారత్ పీడర్ పరిధిలో మంగళవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇ మధురంజన్ తెలిపారు. నవభారత్ పీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఐడిఏ ఉప్పల్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు. అదే విధంగా శ్రీ కృష్ణ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు తోడ్పడాలి

## - సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైశ్వాల్

**నాంపల్లి, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మెట్రోపాలిటన న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సెషన్స్ జడ్జి పాపిరెడ్డి సూచనల మేరకు కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలన, సేవ్ చిల్డ్రన్–సేవ్ ఇండియా క్యాంపైన్ మద్దతుగా పారా లీగల్ వాలంటీర్లు, లా విద్యార్థులు, పోలీసులు, బచ్‌పన్ బచావో ఆందోళన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు తదితరులు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్‌జడ్జి, మెట్రోపాలిటన్ న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైశ్వాల్ బాల్య వివాహాల నిర్మూలన కొరకు ప్రతిజ్ఞ చేయించి మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు తోడ్పడాల్సిన, కృషిచేయాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని స్పష్టం చేశారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అయినా నేటికీ కొన్నిచోట్ల జరుగుతూనే ఉన్నాయని, ఇందులో దేశంలో తెలంగాణ రాష్ట్రం 12వ స్థానంలో ఉందని ఆవేదన వ్యక్తపరుస్తూ, పిల్లలు చక్కగా చదువుకొని అభ్యున్నతి చెందాల్సిన వయస్సులో పెళ్లిళ్లుచేసి వారి జీవితాన్ని నాశనం చేయకుండా చక్కగా చదివించి మంచి ప్రయోజకులను చేయాలని ఆమె తల్లిదండ్రులకు సూచించారు. బాల్య వివాహం జరుగుతున్నట్లు ఎవరి దృష్టికైనా వస్తే వెంటనే సంబంధిత గ్రామ సర్పంచ్‌కు లేదా పోలీసులకు కానీ ఫిర్యాదు చేయాలని సూచిస్తూ అలా చేసినప్పుడే ఒక నిండుజీవితాన్ని కాపాడిన వారమవుతామని రాధిక జైశ్వాల్ హితవుపలికారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు కాంప్లెక్స్ జ్యుడీషియల్ ఆఫీసర్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులూ పాల్గొన్నారు.



బాల్యవివాహాల నిర్మూలనకు మద్దతు తెలుపుతున్న రాధిక జైశ్వాల్, సత్యనారాయణ

# జాతీయ అధ్యక్ష ఎన్నికల్లో ఓట్లు వేసిన సీనియర్ నాయకులు

**నార్సింగి, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికలలో రాజేంద్రనగర్ సీనియర్ నాయకులు బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ముంగి జైపాల్‌రెడ్డిలు తమ ఓటు హక్కును గాంధీభవన్‌లో వినియోగించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంను బతికించుకోవడం కోసం ముందు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని ఓటింగ్ ద్వారా ఎంపిక చేస్తున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులైన మల్లిఖార్జున్ ఖర్గే, శశీథరూర్‌లు జాతీయ అధ్యక్షుడి కోసం పోటీ పడ్డారని, స్వేచ్ఛగా కాంగ్రెస్ ప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగంచుకున్నారని వివరించారు. దేశవ్యాప్తంగా 9,800.మంది పీసీసీ ప్రతినిధులు ఈ ఎన్నికల్లో ఓట్లు వేశారని తెలిపారు. మాకు ఈ ఎన్నికలో ఓటు వేసేందుకు అవకాశం కల్పించిన పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో యువరక్తంను ఎక్కించి, పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీలు అనేక సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. పార్టీ కోసం పని చేసే వారికే పదవులు ఇస్తూ, భూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్ట పరిచి, వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేసేలా అధిష్టానం పలు కీలక చర్యలు తీసుకుందని తెలిపారు. మునుగోడుతోనే కాంగ్రెస్ పార్టీ విజయాల బాట ప్రారంభమవుతుందని, వచ్చే అసెంబ్లీ ఎన్నిక ల్లో అధికారంలోకి వచ్చి తీరుతుందని జ్ఞానేశ్వర్, జైపాల్‌రెడ్డిలు స్పష్టం చేశారు.



## క్రీడల్లో స్నేహాభావాన్ని పెంపొందిస్తాయి:చందు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** క్రీడలు ఆహ్లాదంతో పాటు స్నేహాభావాన్ని పెంపొందిస్తాయని చైతన్యపురి డివిజన్ టిఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. తట్టిఅన్నారం సిఎస్ఆర్ గ్రౌండ్ లో సోమవారం డిఎస్ఆర్ మొదటి ప్రేమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరకద్రఢివ్యంతో పాటు ప్రశాంతత కూడా క్రీడల ద్వారా నెలకొంటుందన్నారు. యాకత్‌పుర రైసింగ్ ఛాలెంజర్స్, ఎల్‌బినగర్ సదరన్ సైజలర్స్ టీంల మధ్య మొదటి మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో సదరన్ సైజలర్స్ విజేతలుగా నిలిచారు. ప్రశాంత్‌పటేల్‌కు మ్యాన్ అఫ్ ది మ్యాచ్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ సాజిద్‌హుస్సేన్, స్పాన్సర్ పాండ్యన్, వినోద్, యూసఫ్, వంశీ, కృష్ణ, జలంధర్, సాయినాథ్‌రాజ్, నరేందర్, కిరణ్, లల్లు తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్ అఫ్ ది మ్యాచ్‌ను అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

## ఓటు హక్కు వినియోగించుకున్న దేప భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష పదవి ఎన్నికలకు సంబంధించి పిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోటీలో ఉన్న అభ్యర్థిలు మల్లికార్జున ఖర్గే, శశిధరూర్‌లకు తెలంగాణలోని పీసీసీ డెలిగేట్స్ ఎన్నికల పోలింగ్ కేంద్రం గాంధీభవన్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం నుంచి దేప భాస్కర్‌రెడ్డి సోమవారం తన ఫోటో హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

## అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి

**వనస్థలిపురం, అక్టోబరు 17, ప్రభాతవార్త :** అంతర్జాతీయ క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకుని ఆస్థాయికి చేరేందుకు మెలకువు నేర్చుకుని రాణించాలని మాజీ ఐఏఎస్‌లు తేజావత్ రామచంద్రు, స్వామి తారాచంద్, ఐఆర్ఎస్ గోవిందు, భవిష్య స్కూల్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ సవాటె అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న హస్తినాపురంలోని భవిష్య స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్, సబ్‌జూనియర్ ఫ్రెంచ్ బాక్సింగ్(సవాటె) పోటీలలో గెలుపొందిన వారికి వారు సోమవారం బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఏ రంగంలోనైనా పట్టుదలతో సాధన చేస్తే విజయం తప్పక సిద్ధిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 150 మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారని, విజేతలు వచ్చేనెల 12, 13వ తేదీల్లో న్యూఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్, సతీష్‌గౌడ్ తెలిపారు.



పోటీని పరిశీలిస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ రామచంద్రు

## ఘనంగా బ్రాహ్మణ వదూవరుల పరిచయ వేదిక

**వనస్థలిపురం, అక్టోబరు 17, ప్రభాతవార్త :** రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదిక ఘనంగా జరిగింది. 1100 మంది వదూవరులు వివరాలను నమోదు చేసుకోగా 32 సంబంధాలు సెటిల్ అయ్యాయి. కార్యక్రమానికి ఎమ్మెల్సీలు సురభివాణి, రాంచద్రరావు, ప్రభుత్వ సలహాదారు వేణుగోపాలచారి, బీజేపీ జాతీయ స్పోక్స్ పర్సన్ ఎన్‌సుభాష్, స్పైసీ హోటల్ అధినేత విజయ్‌కుమార్, డీసీ మారుతీ దివాకర్ హాజరయ్యారు. ఈసందర్భంగా మారుతీ దివాకర్ మాట్లాడుతూ... యుక్తవయసులోనే పెళ్లిళ్ల చేసుకోవాలన్నారు. బ్రాహ్మణులు సమాజానికి ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్సీ సురభివాణి అన్నారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా బ్రాహ్మణులకు తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా సహాయం చేస్తోందన్నారు. వేణుగోపాలచారి మాట్లాడుతూ... బ్రాహ్మణులంతా ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షు, కార్యదర్శులు పోచంపల్లి శ్రీధర్‌రావు, నందిరాజు లక్ష్మీనారాయణ, గౌరవాధ్యక్షులు చింతపల్లి మంగపతిరావు, పోగుల రాంబాబు, శ్రీదర్‌రావు, వాసుదేవరావు, సిహెచ్‌విఆర్‌కెమూర్తి, వైష్ణవి క్యాటరర్స్ అధినేత ప్రసాద్, గణేష్ దేవాలయాల అధ్యక్ష, కార్యదర్శులు సోమయాజులు, లక్ష్మణరావు, సుబ్బారావు, వేదిక కన్వీనర్ శర్మ, వైదేహినగర్ హనుమాన్‌టెంపుల్ అధ్యక్షుడు నారాయణరావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పాల్గొన్న ఎమ్మెల్సీలు, అసోసియేషన్ ప్రతినిధులు

## మీర్‌పేట్‌లో ఎస్ఎన్‌డిపి పనుల పరిశీలన

**సరూర్‌నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో జరుగుతున్న ఎస్ఎన్‌డిపి పనులను సోమవారం మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డిలు పరిశీలించారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల మేరకు వారు కమీషనర్ చిట్టి నాగేశ్వర్, డిఇఇ గోపినాథ్, ఎఇఇ శ్రీనివాస్ తదితర అధికారులతో కలిసి పనులు జరుగుతున్న మీర్‌పేట్ మంత్రాల చెరువు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వరద నీరు వెళ్ళే మార్గాల్లో జరిగే పనులపై వారు సమీక్ష జరిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి ఆదేశాల మేరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులు జరిపించడం జరుగుతుందని తెలిపారు.



పనులను పరిశీలిస్తున్న మేయర్ దుర్గ

## చట్‌పూజ కోసం బతుకమ్మ ఘాట్ వద్ద ఏర్పాట్లు : డిసి

**ఉప్పల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** ఉప్పల్‌లో ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే చట్‌పూజ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని బీహార్ అసోసియేషన్ నేతలు రవిశంకర్‌సింగ్, ప్రభాస్ కుమార్, అరవింద్‌యాదవ్, అశోక్‌సింగ్ సోమవారం డిసి అరుణకుమారిని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బీహార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30,31వ తేదిలలో ఉప్పల్ నల్ల చెరువు, రామంతాపూర్ చిన్న చెరువు వద్ద చట్‌పూజ కార్యక్రమం చేపడుతున్నామని, ఉప్పల్ నల్ల చెరువు బతుకమ్మ ఘాట్‌లో మంచినీరు నింపి, పారిశుధ్య నిర్వహణ పనులు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ అరుణకుమారి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.



వినతి పత్రం ఇస్తున్న బీహార్ అసోసియేషన్ నేతలు

## నిరంతరంగా అభివృద్ధి: మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి నిరంతరం కొనసాగుతుందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని జల్‌పల్లి మున్సిపాలిటీ 21, 22, 24 వార్డుల్లో రూ.75 లక్షలతో చేపట్టిన యుజిడి, బిటి, సిసి రోడ్డు పనులను సోమవారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో నిరంతర ప్రక్రియగా అభివృద్ధిని కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజలకు కనీస మౌళిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యతనిస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. కమీషనర్ ఎన్. వసంత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛైర్మన్ అబ్దుల్లా సాది, వైస్ ఛైర్‌పర్సన్ ఫర్హానా నాజ్, పలువురు కౌన్సిలర్లు, టిఆర్ఎస్, ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభించిన మంత్రి సబితారెడ్డి

## గడ్డంశ్రీనివాస్‌యాదవ్‌కు సన్మానం

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** ఎస్.ఎస్.కె.సమాజ్ ఆధ్వర్యంలో సుమారు 500మంది మెరిట్ విద్యార్థులను సన్మానించారు.గడ్డం గంగాధర్ ఫౌండేషన్, టిఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్ని మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులు,మెడల్ సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత చదువులను అభ్య సించి సమాజ్ శ్రేయస్సు కొరకు పాటుపడా లని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఎస్.కె సమాజ్ ప్రతినిధులు కాటిగార్ శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.ఎస్.కె సమాజ్ ఆధ్వర్యంలో గడ్డం శ్రీనివాస్‌యాదవ్‌కు సన్మానం

## బిజెపి సభ్యత్వం లేని వారిని చేర్చుకున్నారు : శ్రీవాణి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** బిజెపి పార్టీలో సభ్యత్వం లేని నలుగురిని టిఆర్ఎస్ పార్టీలో చేర్చుకొని గొప్పగా చెప్పుకోవడం సిగ్గుచేటని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ పేర్కొన్నారు. వెంకటేశ్వరకాలనీలోని కార్పొరేటర్ కార్యాల యంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మంత్రి స్థాయిని మరిచి చౌకబారు ఆరోపణలు చేయడం సరైనది కాదన్నారు. సోషల్‌మీడియా ద్వారానే మంత్రి కేటీఆర్ మంత్రులకు ఆదేశాలు ఇస్తున్నారని ఆ విషయం మరిచి సోషల్ మీడియాను కించపరిచే విధంగా ప్రకటన చేయడం సరైనది కాదన్నారు సరూర్‌నగర్ డివిజన్లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పని చేసిన ఉద్యమకారులకు స్థానం లేకుండా చేసి ల్యాండ్‌గ్రాఫరు, గుండాలు, స్వార్థ రాజకీయాల కోసం పనిచేసే వారే టిఆర్ఎస్‌లో ఉన్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోడీ విశ్వగురు అని దేశంకోసం, ధర్మంకోసం, వ్యక్తిత్వ వికాసంకోసం, దేశ సంరక్షణకోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని తెలిపారు. డివిజన్లో మంత్రి శంకుస్థాపన చేసిన పనులు నేటికీ ఎందుకు పూర్తి కాలేదని ప్రశ్నించారు. టిఆర్ఎస్ నాయకుల సోషల్ మీడియా అకౌంట్స్ రద్దు చేసుకొని తర్వాత మా సోషల్ మీడియా గురించి ఆలోచించండని సూచించారు. ఈ సమావేశంలో మందుల శ్రీధర్‌రాజ్, హరిరాజ్‌గౌడ్, ఖదీర్‌దాస్, రాములు, లావణ్య, మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్‌కుమార్

**బిజెపిని గెలిపించి రాష్ట్రాన్ని కాపాడండి : ఆకుల శ్రీవాణి**

మునుగోడు ఉప ఎన్నికలలో బిజెపి అభ్యర్థి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి టిఆర్ఎస్ రాక్షస పాలన నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ కోరారు. మునుగోడు ఉప ఎన్నికలలో భాగంగా కార్పోరేటర్ ప్రచార కార్యక్రమంలో పాల్గొని అభ్యర్థి రాజగోపాల్‌రెడ్డికి విజయ తిలకం దిగారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ఎన్నికలలో టిఆర్ఎస్‌ని ఊడగొట్టి మిగిలిన 10నెలలు కెసిఆర్‌తో సెక్రటేరియట్ నుంచి మనతెలంగాణ సంక్షేమం కోసం పని చేయించాలన్నారు. ఉప ఎన్నికలలో టిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలన్నారు

## స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించడం అభినందనీయం

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** మహిళల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని వర్తమాన తార అక్షర అన్నారు. సోమవారం సోమాజిగూడలోని హెచ్‌డిఎఫ్‌సి కార్యాలయంలో వివిధ సెక్షన్ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను బ్యాంక్ అధికారి శ్రీకాంత్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒంటరి మహిళలు, ఆర్థికంగా చిదిరిపోయిన మహిళలు ఉత్పత్తి చేసిన వస్తువులకు మార్కెట్ కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉదన్నారు. గత 20ఏళ్లుగా తమబ్యాంక్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నిర్వహిస్తున్నామని శ్రీకాంత్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థలు చేస్తున్న కార్యక్రమాలను వివరించి వారి ఉత్పత్తులను కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు.

## యాదవ సంఘం నూతన కార్యవర్గం

**హయత్‌నగర్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** హయత్‌నగర్ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని సోమవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా నక్క ఉమేష్‌యాదవ్, ఉపాధ్యక్షులుగా గజ్జి వెంకటేష్‌యాదవ్, జెల్ల నరేష్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటేష్ యాదవ్, ఉపకార్యదర్శులుగా గజ్జి శ్రీనివాస్‌యాదవ్, దొడ్డి సతీష్‌యాదవ్, కూకుంట్ల మల్లేష్ యాదవ్, కోశాధికారులుగా దొడ్డి లక్ష్మణ్‌యాదవ్, జెల్ల శ్రీకాంత్ యాదవ్, గడ్డం శ్రీశైలంయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా బండారి సురేష్‌యాదవ్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, జెల్ల భాస్కర్ యాదవ్, పి.రాహుల్ యాదవ్, జెల్ల గోపాల్‌యాదవ్, ముఖ్య సలహాదారులుగా వై.ఎం.ఆగమయ్యయాదవ్, గజ్జి నర్సింహ యాదవ్, జెల్ల సత్తయ్యయాదవ్, బండారి రాజుయాదవ్, గజ్జి ఉమేష్ యాదవ్, సలహాదారులుగా గడ్డం రాజుయాదవ్, గజ్జి రాజుయాదవ్, గజ్జి వెంకటేష్ యాదవ్, మురళీ యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక నిర్వాహకులుగా బండారి మహేందర్‌యాదవ్, గడ్డం బాబురావుయాదవ్ వ్యవహరించారు. **యువజన కమిటీ :** అధ్యక్షుడిగా గడ్డం బాలకృష్ణయాదవ్, ఉపాధ్యక్షులుగా దొడ్డి భాస్కర్‌యాదవ్, గడ్డం ప్రభాకర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా బండారి రాముయాదవ్, గజ్జి రాజుయాదవ్, ఉపకార్యదర్శులుగా జెల్ల భరత్‌యాదవ్, బండారి బాలకృష్ణయాదవ్, కోశాధికారిగా ఆవుల శ్రీశైలం యాదవ్, దొడ్డి శివయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా గడ్డం నవీన్‌యాదవ్, గజ్జిపవన్‌యాదవ్, మర్రిపల్లి హరీష్‌యాదవ్, గడ్డం శివకుమార్‌యాదవ్ ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గ సభ్యులు

## నాదర్‌గుల్-యాంజాల్ రోడ్డును వేయించాలని వినతి

**సరూర్‌నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** వర్షాల వల్ల అధ్వాన్నంగా తయారైన నాదర్‌గుల్ నుండి తుర్క యాంజాల్ వరకు ఉన్న రోడ్డును నిర్మించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి ఫ్లోర్ లీడర్, స్థానిక 27వ డివిజన్ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి ఆర్‌అండ్‌బి ఇఇని కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం ఇఇని కలిసి ఒక వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు, మూడు నెలల నుండి కురిసిన భారీ వర్షాల వల్ల నాదర్‌గుల్-తుర్క యాంజాల్ రోడ్డు పూర్తిగా పాడైందనీ దీంతో ఈ రహదారిలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఇఇ దృష్టికి తెచ్చారు. ఈ రోడ్డు విష యంలో ఉన్న కేసును త్వరితగతిన పరిష్కరింపజేసి రోడ్డు నిర్మాణం చేయించాలనీ ఒక వేళ కేసు కొలిక్కిరావడంలో జాప్యం జరిగినా కనీసం నాదర్‌గుల్ గ్రామ పరిధి వరకైనా రోడ్డును నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.



వినతి పత్రం ఇస్తున్న తోట శ్రీధర్‌రెడ్డి

## కాంగ్రెస్‌లో భేషుగ్గా అంతర్గత ప్రజాస్వామ్యం

**సరూర్‌నగర్ :** ఎఐసిసి అధ్యక్ష పదవికి సోమవారం జరిగిన పోలింగ్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఓటింగ్ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఘన కీర్తి గల కాంగ్రెస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం భేషుగ్గా ఉందనడానికి అధ్యక్ష పదవి ఎన్నికలే నిదర్శనమని అన్నారు.



శాలివాహననగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే బలాల

## డివిజన్లో సమస్యల పరిష్కారానికి కృషి : బలాల

**మలక్‌పేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** మూసరాంబాగ్ డివిజన్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బలాల పేర్కొన్నారు డివిజన్‌లోని శాలివాహననగర్‌లో మాజీ కార్పొరేటర్ మహమ్మద్ అస్లాం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బాలల హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ కాలనీ సంఘాల నాయకులతో సమావేశం అయి పాదయాత్ర నిర్వహించి సమస్యలను తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన బడ్జెట్ నుంచి రూ.5 కోట్లు నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దంతుల మాణిక్ రెడ్డి, ముత్తయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఈదమ్మ తల్లి దేవాలయంలో పూజలు

**మలక్‌పేట, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** చాదర్ ఘాట్ కమల్ నగర్ లోని ఈదమ్మ తల్లి దేవాలయంలో ఓ నాగుపాము మూడు రోజుల నుంచి ఉండడంతో స్థానికులు ఆదిమూల కృష్ణ నాగుపామును గుర్తించారు. దేవాలయంలోకి ప్రవేశించిన నాగుపాము మరల వెళ్ళిపోతుందని భావించినప్పటికీ దేవాలయంలో ఉండిపోవడంతో ఆయన స్థానికులను అప్రమత్తం చేశారు. ఈ విషయం తెలియడంతో పలువురు మహిళలు దేవాలయం వద్ద పూజలు నిర్వహించా రు. పరిసర ప్రాంత ప్రజలు పామును తిలకించడానికి దేవాలయానికి తరలివచ్చారు.



ఈదమ్మ తల్లి దేవాలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఆదిమూల కృష్ణ



## కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి : ఉపకమిషనర్

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో సమావేశం త్వరలో నిర్వహిస్తామని సరూర్‌నగర్ ఉపకమిషనర్ హరికృష్ణయ్య పేర్కొన్నారు. డివిజన్‌లోని డాక్టర్స్ కాలనీ సంక్షేమ సంఘం భవనాన్ని ఉపకమిషనర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రధానకార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు కాలనీలోనీ సమస్యల గురించి ఉపకమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం కాలనీలో సీనియర్ సిటిజన్ భవనాన్ని ఉపకమిషనర్ సందర్శించి నిర్వహణకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు వన్నడి శ్రీనివాస్, జనార్ధన్‌రెడ్డి, కోశాధికారి ఉమామహేశ్వరరావు, ఆకారపు కృష్ణా, ప్రవీణ్‌కుమార్, టి.శ్రీనివాస్, చంద్రయ, దయాకర్, ఆంజనేయులు, నరేష్, రవి, సరిత, మమతా, విజయారెడ్డి, కోదండరామరావు, లక్ష్మణ్‌రావ్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు పిపిఎ కిట్‌ల పంపిణీ



కిట్‌లను అందచేస్తున్న సురేఖ ఓంప్రకాష్‌బిస్వా

**గన్‌ఫౌండ్రి, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** గన్‌ఫౌండ్రి డివిజన్ పరిధిలోని పారిశుధ్యకార్మికులకు డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌బిస్వా పిపిఎ కీట్‌లను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిపిఎ కిట్లలో 32 సంతూర్ సబ్బులు, 2లీటర్ల కొబ్బరినూనెడబ్బాలు, నాలుగు శానిటైజర్ బాటిళ్లు, చేతులకు వేసుకునే గ్లౌజ్, జతఫూస్‌లు, టోపి, చేతులకు అందచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్టు

**సంజీవరెడ్డి నగర్ :** ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో యాష్ ఆయిల్ సరఫరా చేస్తున్న వ్యక్తిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. షేక్‌పేట్‌కి చెందిన సురేష్ అనే వ్యక్తి నుండి పోలీసులు ఒక కేజి యాష్ ఆయిల్ సీజ్ చేశారు.

## పేదింటి ఆడపిల్లల పెళ్ళిళ్ళకు భరోసా కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌లు : మంత్రి



చెక్కులను అందజేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** పేదల ఇళ్ళల్లో ఆడ పిల్లల పెళ్ళిళ్ళకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్‌లోని మహేశ్వరం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో సోమవారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన 32 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా సబితారెడ్డి లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పేదల వివాహాలకు నగదును సాయం చేసే పథకం దేశంలో ఎక్కడా లేదని అన్నారు. సిఎం కెసిఆర్ పేద కుటుంబాలకు అండగా ఉంటూ సాయం అందిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్, టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్లకు చెందిన పలువురు కార్పొరేటర్లు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## లక్ష్యసాధన కోసం విద్యార్థులు ముందుకు సాగాలి: శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** నేటి యువత రేపటి సమాజ నిర్మాతలని జాగృతి విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఓ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జాగృతి డిగ్రీ, పిజీ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థుల స్వాగత సమ్మేళన కార్యక్రమం సోమవారం నారాయణగూడలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమ జీవిత లక్ష్యాన్ని ఎంచుకుని, ఆ లక్ష్యసాధన కోసం సరైన ప్రణాళికలతో సమయ పాలనతో సక్రమంగా తమ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. కళాశాల జాయింట్ డైరెక్టర్ శశికిరణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రాంకుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న ప్రగతిని వివరించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లారావు, సైన్స్ కోర్సుల డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి, రాజగోపాల్, రెబెకా, మధుసూదన్, డాక్టర్ చైతన్య, వినయ్‌రావు, ఆనూష, దిశ, సంతోష్‌రెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ ఓ.శ్రీనివాస్‌రెడ్డి



పి 4 చెస్ డిసెంబర్ 24నుంచి 28వరకు జరిగే టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్దార్ బిషన్‌సింగ్ మెమోరియల్ ఆలిండియా ఓపెన్ ఫైట్ రైటింగ్ టోర్నమెంట్ అధ్యక్షుడు కెఎస్ ప్రసాద్, కర్నెన్, మిస్టర్ రాము కంది, సర్దార్ అమిత్ పాల్‌సింగ్

## ఈద్గా షెడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

**ఉప్పల్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్‌లోని ముస్లిం స్మశానవాటికలో రూ. 39లక్ష ల వ్యయంతో నిర్మిస్తున్న షెడ్డు నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సిఎం కెసిఆర్, మంత్రి కేటిఆర్ అన్ని కులాలు, మతాలకు సమాన ప్రాధాన్యత ఇస్తున్నారని, డివిజన్‌లో షెడ్డు నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకుని వస్తామన్నారు. మైనార్టీ సోదరులకు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మైనార్టీసెల్ నాయకులు అబ్బుబాయ్, ఖాసీం, ఇమామ్, అల్తాఫ్, మహుమూద్, హనీఫ్, తాహేర్, గౌస్, మహ్మద్, షఫీ, టిఆర్ఎస్ నాయకులు కొండల్‌రెడ్డి, కె.జగన్, మాస శేఖర్, మహిళా అధ్యక్షురాలు సుభద్ర, సరిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పనులు పరిశీలిస్తున్న బన్నాల గీత ప్రవీణ్

## బిఆర్ఎస్‌లో చేరికలు

**అఫ్జల్‌గంజ్, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** గుజరాత్ సూరత్‌లో మైనార్టీలు బిఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నట్లు హైదరాబాద్ మార్కెటిం గ్ కమిటి డైరెక్టర్ పి. మాణిక్‌రావు తెలిపారు. సూరత్‌లో గత 10 రోజులనుంచి గుజరాత్ సూరత్‌లో అన్నివర్గాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ స్థాపించనున్న బిఆర్ఎస్‌లో ప్రజలు స్వచ్ఛందగా చేరుతున్నట్లు చెప్పారు.



బిఆర్ఎస్‌లో చేరిన మైనార్టీలు

## దీపావళి సందర్భంగా హిందూ శ్మశానవాటికల్లో సౌకర్యాలు కల్పించాలి

**హైదరాబాద్, అక్టోబరు 17, ప్రభాతవార్త :** దీపావళి పర్వదినం నేపథ్యంలో నగరంలోని హిందూ శ్మశానవాటికలలో కనీస సౌకర్యాలు మెరుగుపర్చాలని బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు డిమాండ్ చేశారు. సోమవారం బర్కత్‌పురలోని ఆపార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ విషయంపై జిహెచ్‌ఎంసి అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఇప్పటికే శ్మశానవాటికలు ఆపరిశుభ్రతతో పిచ్చి చెట్లు, మొక్కలు, మట్టి కుప్పల్ నెలకొని ఉందన్నారు. ప్రతి దీపావళి పర్వదినం రోజు హిందూ సాంప్రదాయం ప్రకారం పూర్వీకుల సమాధులను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించడం సంప్రదాయంగా వస్తోందన్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి దీపావళి వేడుకలకు ముందే వాటిల్లో పారిశుధ్య పనులు చేపట్టి వీధి దీపాలతో, అందమైన మొక్కలు ఏర్పాటు చేయాలని కోరారు.



హోటల్ హరితప్లాజ్‌లో జరిగిన పాషిక్‌టిక్ వంటలపోటీలో గెలుపొందిన వైజాగ్‌కు చెందిన పొన్నాడ పద్మజ, వరంగల్‌కు చెందిన రమాదేవి, కరీనంగర్‌కు చెందిన టి జోవర్‌ఫ్లోర్ బీర్